## క్లుప్తంగా

### పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి



**ఘంటసాలపాలెం(ఘంటసాల):** పరిసరాల పరిశుభ్రతకు ప్రజలందరూ సహకరించాలని ఈఓపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ఘంటసాలపాలెం, కొడాలి, చిట్టూర్పు, మల్లంపల్లి గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై శనివారం ప్రత్యేక డ్రైవ్‌ను పంచాయతీ కార్యదర్శులు బి.అర్జున రావు, నాగమణి, శ్రీలక్ష్మి, అబ్దుల్ నయీమ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఘంటసాలపాలెంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికి వెళ్లి తడి పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించారు. అనంతరం ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, పంచాయతీలు, సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ముళ్లకంప తొలగింపు



**పెదకళ్లేపల్లి(మోపిదేవి):** మండలంలోని పెదకళ్లేపల్లిలో మహాశివరాత్రి సందర్భంగా పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌కు స్థలం ఏర్పాటులో అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామ పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా వాహనాల పార్కింగ్ ఏర్పాటుకు స్థలం సిద్ధం చేస్తున్నారు. పెదకళ్లేపల్లి నుంచి మంగళాపురం రహదారిలో దేవస్థానానికి చెందిన ఖాళీ ప్రదేశంలోని ముళ్లకంప, చెత్తను శనివారం తొలగించారు. కృష్ణానది ఒడ్డున మరుగుదొడ్లు శుభ్రం చేశారు. గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలు తొలగించి లైన్ క్లియర్ చేశారు.

### యూనిక్ ఐడీ కోసం నమోదు చేసుకోవాలి

**కోడూరు:** వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునికీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడీ) కోసం అన్నదాతలందరూ దరఖాస్తు చేసుకోవాలని ఏఓ శ్రీధర్ శనివారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే పథకాలు వర్తించాలంటే ఈ యూనిక్ ఐడీ తప్పనిసరిగా కావాలని, వీటి నమోదు ప్రక్రియ ప్రస్తుతం సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల వద్ద జరుగుతుందన్నారు. సొంత పొలం ఉన్న ప్రతి రైతు ఈ ఐడీ కోసం నమోదు చేసుకోవాలని, ఆధార్ కార్డు, ఆధార్ లింకు అయిన ఫోన్ నంబర్, పొలం పట్టాదార్ పాస్‌పుస్తకం జిరాక్స్‌లతో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని ఏఓ కోరారు.

### ఇసుక లోడు ట్రాక్టర్లకు జరిమానా

**చల్లపల్లి:** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లకు ఒక్కొక్క దానికి రూ.2500 చొప్పున అపరాధ రుసుము విధించినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీలత శనివారం తెలిపారు. నడకుదురు నుంచి చల్లపల్లి వైపునకు వస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం చల్లపల్లి పోలీసులు తనిఖీ చేయగా సరైన కాగితాలు చూపించకపోవటంతో తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించారు. కాగా వాటికి అపరాధ రుసుము విధించి విడిచిపెట్టినట్లు శ్రీలత తెలిపారు.

### ఎద్దుల బండిని ఢీకొన్న పాలవ్యాన్

వ్యక్తికి, ఎద్దులకు గాయాలు



**కాసానగర్(మోపిదేవి):** మండలంలోని పెదప్రోలు శివారు కాసానగర్ వద్ద 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎద్దులకు, యజమాని సుబ్బారావుకు తీవ్ర గాయాలు కావడంతో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. పెదయాదరకు చెందిన అర్జా సుబ్బారావు శనివారం తెల్లవారు జామున ఎద్దుల బండిపై ఉప్పుబస్తాలు వేసుకుని అవనిగడ్డ వైపు వస్తుండగా, వెనుక నుంచి వేగంగా వస్తున్న పాలవ్యాన్ బలంగా ఢీ కొనడంతో బండి పూర్తిగా విరిగిపోయింది. అందులో ప్రయాణిస్తున్న బండి యజమాని సుబ్బారావుకు, రెండు ఎద్దులకు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనం ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు అందాల్సి ఉంది.

# అపూర్వఘట్టం.. నేడు సాక్షాత్కారం

- నేడు పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక
- 1932 నుంచి ఒకచోట చేరనున్న 92 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు
- చల్లపల్లి ఎస్ఆర్‌వైఎస్‌పీ స్కూల్, కళాశాలలో సన్నాహాలు పూర్తి




1932- 2024 పూర్వ విద్యార్థులకు స్వాగత బ్యానర్ వద్ద నిర్వాహకులు

**చల్లపల్లి:** చల్లపల్లి శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామప్రసాద్ (ఎస్ఆర్‌వైఎస్‌పీ) హైస్కూల్, జూనియర్ కళాశాలలో ఆదివారం అపూర్వ ఘట్టం చోటుచేసుకోనుంది. 1932లో పాఠశాల ప్రారంభించిన నాటి నుంచి 92 సంవత్సరాలకు చెందిన 92 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులందరూ తాము చదివిన స్కూలులో కలవనున్నారు. సాధారణంగా ఏ బ్యాచ్‌కి ఆ బ్యాచ్ విద్యార్థులు కలుస్తుండటం సహజం. కానీ తొలిసారిగా పూర్వ విద్యార్థులు అందరూ కలుసుకోవటం ఇక్కడ విశేషం.

**1932 నుంచి..**

1932లో పాఠశాల ప్రారంభించన తేదీన పదవ తరగతి చదివిన విద్యార్థులకు ఇప్పుడు 108 సంవత్సరాల వయస్సు ఉంటుంది. అంత వయస్సు ఉన్నవారు ఎందరు ఉంటారో తెలియదు కాబట్టి కొంత వయస్సు తగ్గించి తీసుకుంటే 95 సంవత్సరాల వృద్ధుల నుంచి 16 సంవవత్సరాల బాలబాలికల వరకూ హాజరుకానున్నారు. 1970వ బ్యాచ్‌కి చెందిన ఎన్ఆర్ఐ మండవ శేషగిరి అందరితో సంప్రదించి ఈ మెగా అపూర్వ కలయికకు శ్రీకారం చుట్టారు. పాఠశాల ప్రారంభించిన 1932లో జన్మించి, 1948లో పదవ తరగతి పూర్తిచేసిన బొందలపాటి వెంకటేశ్వరరావు ఈ సమావేశంలో ప్రసంగించనున్నారు.

**నేటి కార్యక్రమాల వివరాలు..**

తొలుత సమావేశానికి వచ్చిన వారి పేర్ల రిజిస్ట్రేషన్ ఉంటుంది. తరువాత అల్పాహారం, యోగా. ఎద్దుల బండ్ల స్వారీ, పొట్టేళ్ల ప్రదర్శనలు. ఉదయం 10 గంటలకు జ్యోతి ప్రజ్వలన, విద్యార్థుల స్వాగత గీతాలాపన కార్యక్రమాలు. దేశ, విదేశాలలో ఉన్న పూర్వ విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉన్నత స్థానంలో కొనసాగుతున్న వ్యక్తులు సందేశాన్ని ఇస్తారు. ఇక్కడ చదివిన ప్రతి ఒక్కరూ రావాలని నిర్వాహకులు కోరారు.

**పుట్టింటికి వస్తున్నట్లు ఉంది..**



అత్తగారింటికి వెళ్ళిన ఆడపిల్ల 30 లేదా 40 సంవత్సరాల తరువాత పుట్టింటికి వచ్చి అందిరినీ కలుస్తున్నాననే ఆనందం ఎలా ఉంటుందో అలాంటి అనుభూతిని నేను పొందుతున్నాను. ఎప్పుడెప్పుడు అందరం కలుస్తామా.. అని ఎదురు చూస్తున్నా.

– మూల్పూరి విజయలక్ష్మి, పూర్వ విద్యార్థిని

**అందరం కలిసే క్షణం కోసం..**



నా పిల్లలు ప్రయోజకులై వస్తున్నప్పుడు ఎంత ఆనందం కలుగుతుందో అంతకు మించిన అనుభూతిని ఈ పూర్వ విద్యార్థుల కలయిక వల్ల పొందుతున్నాను. ఇలా అందరం కలిసే క్షణం కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నా..

– మేకా శివనాగేశ్వరరావు, రైతు, పూర్వ విద్యార్థి

**ఆ ఆనందం మాటల్లో చెప్పలేను..**



మాది వక్కలగడ్డ. హైస్కూల్ చదువు కోసం ఇక్కడికి వచ్చా. అప్పట్లో ఓ పెద్ద యూనివర్సిటీకి వచ్చిన ఫీలింగ్ కలిగింది. అదో ప్రపంచం. నాటి స్నేహితులు నా ముందు.. తరువాత అందరూ వస్తారని అందరినీ మరోసారి కలవబోతున్నాననే ఆనందం మాటల్లో చెప్పలేను.

– మల్లుపెద్ది రాణీకుమారి, రిటైర్డ్ టీచర్, 1977 బ్యాచ్

**ఇప్పటికి 1000కి పైగా రిజిస్ట్రేషన్స్..**



ఏటా మా బ్యాచ్ వాళ్లం మాత్రమే కలిసేవారం. కానీ ఈసారి ఇలా ఏర్పాటు చేశాం. బహుశా ఇలా ఇన్ని పూర్వపు బ్యాచ్‌లు కలవటం నాకు తెలిసి ఇదే మొదటి సారి. ఈ కార్యక్రమానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కూడా పెట్టాం. ఇప్పటి వరకూ వెయ్యికి పైగా అయ్యాయి. 1500 నుంచి 2000 వేల మధ్య పూర్వ విద్యార్థులు హాజరవుతారని అనుకుంటున్నాం.

– మండవ శేషగిరి, ఎన్ఆర్ఐ, 1970 బ్యాచ్

### మహాశివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు

దేవదాయ ఉప కమిషనర్ రమేష్‌బాబు



**కృత్తివెన్ను:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్సవాల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కాకినాడ దేవదాయశాఖ ఉప కమిషనర్ డీఎల్వీ.రమేష్‌బాబు అన్నారు. కృత్తివెన్నులో ప్రసిద్ధిగాంచిన శ్రీ దుర్గాపార్వతీసమేతనాగేశ్వరస్వామి వారి దేవస్థానాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నట్లు ఈవో వివరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మురళీకృష్ణశర్మ, జేఏ నాగేశ్వరరావు ఉన్నారు.

### రేపటి నుంచి ఆధార్ శిబిరాలు

**గూడూరు:** అంగన్‌వాడీ కేంద్రాల వారీగా బర్త్ సర్టిఫికెట్ కలిగి ఉన్న చిన్నారులకు ఆధార్ నమోదు చేయడానికి ఈనెల 24 నుంచి ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ బి.రాజేశ్వరి తెలిపారు. ఈనెల 24న మల్లవోలు- 1, 25న మల్లవోలు- 2, 26న పోసినవారిపాలెం, 27న కంకటావ, 28న గూడూరు- 2 గ్రామ సచివాలయాలలో ఆధార్ నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. 6 సంవత్సరాల లోపు వయస్సు చిన్నారులందరికీ ఆధార్ నమోదు చేయించేలా చొరవ తీసుకోవాలని కోరారు.

## వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ వాణి వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాణి తదితరులు

**పెడన:** వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఇప్పటి నుంచి పటిష్ట చర్యలు తీసుకోవాలని, అందుకు తగ్గ ప్రణాళికలు రూపొందించాలని పెడన ఎంపీపీ రాజులపాటి వాణి స్పష్టం చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత ఇన్‌చార్జి ఎంపీడీవో సీహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ప్రభుత్వ పథకాలు, నిధుల గురించి చర్చించవద్దని స్పష్టం చేశారు. అనంతరం పలు శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించే సమయంలో ఆయా శాఖల అధికారులు ఎన్నికల కోడ్‌ను మరచిపోయి ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి చెప్పడం విశేషం. ఎంఈవో- 2 హరనాథ్ విద్యాశాఖపై మాట్లాడుతూ బడి పిల్లలకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పెడుతున్నామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ కింద మండలంలో పలు ప్రాంతాల్లో మైక్రో ఫిల్టర్ల ఏర్పాటు పూర్తి కావచ్చాయని తెలిపారు. విద్యుత్ ఏఈ ఏడుకొండలు మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ గురించి వివరించారు. హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ మాట్లాడతూ నవరత్నాల కింద ఇళ్లను మంజూరు చేశామని చెప్పడం విశేషం. ఇలా ఒక్కో అధికారి కోడ్ అమల్లో ఉండగా ఆయా ప్రభుత్వ పథకాల గురించి ప్రస్తావించడంతో సభ్యులు ఆయోమయానికి గురయ్యారు. అచ్చయ్యవారిపాలెం సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ జింజేరు గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూలుగా మార్పు చేయాలని కోరారు. దీనిపై నివేదికలు పంపించామని ఎంఈవో సమాధానం ఇచ్చారు. సమావేశానికి రాని అధికారులు రెండు రోజుల్లో వివరణ ఇవ్వాల్సలని, లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో తెలిపారు. పంచాయతీ రాజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఆర్అండ్‌బీ, చేవేంద్ర పీహెచ్‌సీ తదితర అధికారులు హాజరు కాలేదు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పరీక్షలపై ఆందోళన చెందొద్దు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు నాగశ్రీ

**మచిలీపట్నంటౌన్:** పరీక్ష సమయంలో విద్యార్థినులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సరైన ప్రణాళికతో చదివితే ఉత్తమ విజయాలు సాధించవచ్చని గైనకాలజిస్ట్ డాక్టర్ బి.నాగశ్రీ అన్నారు. స్థానిక పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో పరీక్షల సమయంలో కౌమార దశలోని విద్యార్థినులు శారీరక, మానసిక ఒత్తిడి లేకుండా పరీక్షలు ఎలా రాయాలి అనే అంశంపై ఆమె శనివారం అతిథి ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో 6 నుంచి 8వ తరగతి బాలికలకు వారి తల్లులకు సలహాలు సూచనలు ఇచ్చారు. మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే ఎండార్ఫిన్‌ల విడుదలను పెంచి, ఒత్తిడిని తగ్గించే మార్గాలను డాక్టర్ నాగశ్రీ వివరించారు. పరీక్షల్లో విజయం సాధించేందుకు విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత, క్రమం తప్పకుండా చదువుకునే అలవాట్లను పాటించాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం, అల్పాహారం తీసుకోవాలన్నారు. ఇంట్లో ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించుకోవాలని సలహా ఇచ్చారు. విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.ఆసిఫ్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయిని జే గ్లోరీ స్వరూపరాణి, పీజీటీలు జే సత్యనారాయణ, రేమ్య, రజియాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

**ప్రపంచ ఆలోచనా దినోత్సవం..**

స్థానిక పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ పితామహుడు బర్డెన్ పావెల్ జన్మదిన వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ కలిసి సర్వమత ప్రార్థనలు చేసి, ప్రపంచ శాంతిని కాంక్షించారు. స్కౌట్ అండ్ గైడ్స్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోలాహలంగా పోతురాజు ఘటాల ఊరేగింపు



ఘటాలకు పూజ, విన్యాసాలు చేస్తున్న రజక పూజారులు, పల్నాటి ఆచారవంతులు

**నాగాయలంక:** గ్రామంలోని బోసుబొమ్మ సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీపోతురాజుస్వామి దేవస్థానంలో వార్షిక జాతర మహోత్సవానికి కమిటీ ఆధ్వర్యంలో శనివారం శ్రీకారం చుట్టారు. జాతర సంప్రదాయాలకు అనుగుణంగా స్వామి వారి ఘటాలను కృష్ణానదిలో రజక పూజారులు శుద్ధిచేసి ప్రత్యేక పూజ, జాతర సంప్రదాయ విన్యాసాలు జరిపారు. తొలుత గతఏడాది జాతర అనంతరం భద్రపర్చిన స్థానిక అంకమ్మ దేవర ఆలయం నుంచి ఘటాలను బయటకుతీసి తూర్పు బజారు మీదుగా ప్రధాన వీధులలో ఊరేగింపుగా కృష్ణానదికి తీసుకువెళ్లారు. నదీజలంతో శుద్ధి పూజ అనంతరం ఘటాలను పూజారులు తలపై ధరించి డప్పు నృత్యాలు, మేళతాళాలతో టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని జల్దిలో ఉంచారు. ఈ సందర్భంగా ఘటాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం తెల్లవారు జామునకు ఘటాలు గుడికి చేరుకోవడంతో పల్నాటి ఆచారవంతులచే జాతర సంప్రదాయరీతిలో గుడి వద్ద సంబరం జరుగుతుందని భక్తులు స్వామివారికి చద్ది నైవేద్యాల సమర్పించి తదుపరి మొక్కుబడులు చెల్లించుకుంటారని నిర్వాహకకమిటి ప్రతినిధులు తలశిల బాలకృష్ణ, ఉప్పల లీలా కృష్ణప్రసాద్(బుజ్జి) చెప్పారు. భక్తులందరికీ ఆదివారం 11గంటల నుంచి సాయంత్రం వరకు మహా అన్న సమారాధన జరుగుతుందన్నారు.

### ముగిసిన వర్క్‌షాప్

**కోనేరుసెంటర్:** మచిలీపట్నంలోని డీఎంఎస్ ఎస్‌వీహెచ్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్ విభాగం ఆధ్వర్యంలో బేసిక్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐఓటి అనే అంశంపై రెండు రోజులు పాటు జరిగిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ వర్క్‌షాపులో కళాశాలకు చెందిన విద్యార్థులు, జిల్లాలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. బేసిక్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐఓటికి సంబంధించిన అంశాలపై వివరించారు. విజయవాడ పీఎస్‌సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగాధిపతి ఎం.రంగారావు,ఎస్‌వీహెచ్ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు బి.వినయ్ పర్యవేక్షించారు.

### నేడు స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై సదస్సు

**మదనపల్లి:** మచిలీపట్నం లక్ష్మీ టాకీస్ సెంటర్ ఎస్.కన్వెన్షన్‌లో ఆదివారం స్టాక్‌మార్కెట్ పెట్టుబడులపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఫైనాన్సియల్ అడ్వైజర్ కృష్ణకైలాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 7 గంటలకు సెషన్ల వారీగా జరిగే కార్యక్రమంలో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు ఎలా పెట్టాలి? భవిష్యత్‌లో ఆర్థిక అవసరాల దృష్ట్యా డబ్బు ఎలా ఆదా చేస్తే బాగుంటుందన్న అంశాలపై అవగాహన కల్పించనున్నారు. వివరాలకు 70328 04888, 70328 05888 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### బాలిక మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు

**పెడన:** పట్టణానికి చెందిన బాలిక శుక్రవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోవడంతో తండ్రి పెడన పోలీసులను ఆశ్రయించారు. సీఐ నాగేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.సాంకేతిక పరిజ్ఞానంతో బాలిక మిస్సింగ్ కేసును ఛేదించారు. మరో బాలుడు బాలికను ఒంగోలు వద్ద ఉంచినట్లు గుర్తించి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

## నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



పెదకళ్లేపల్లిలో నాగేశ్వరస్వామివారు

**పెదకళ్లేపల్లి(మోపిదేవి):** పెదకళ్లేపల్లిలో కొలువైన శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఈనెల 23 నుంచి మార్చి నెల 3వ తేదీ వరకు అత్యంత వైభవోపేతంగా మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు వెల్లడించారు. శనివారం ఉత్సవ వివరాల షెడ్యూల్స్ ప్రకటించారు. వైదిక కార్యక్రమాల అనుసరించి ఆదివారం ఉదయం 10.30 గంటలకు శ్రీస్వామివారిని పెండ్లి కుమారుని చేయుటంతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. రోజువారీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 28వ తేదీ వరకు పూజాది కార్యక్రమాలు ఉంటాయి. ఈనెల 25వ తేదీ స్వామివారి దివ్య కల్యాణోత్సవంలో పాల్గొన్నదలచిన దంపతులు సాయంత్రం 5 గంటల లోపు రూ.1,500 చెల్లించి రశీదు పొందాలని సూచించారు. 25 నుంచి 28వ తేదీ వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీసీ తెలియచేశారు.

## వైభవంగా చండీ హోమం



సుహాసినులుగా చిన్నారులు

**చల్లపల్లి:** పడమర వీధిలోని శ్రీ రాఘవపురపు వెంకటకృష్ణమ్మ జానకీ రామాలయంలో శనివారం మూలమంత్ర సహిత చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కనుమళ్ళ రామకృష్ణ శాస్త్రి, విజయ్‌కుమార్ శర్మల ఆధ్వర్యంలో అర్చకులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. ఎనిమిది సంవత్సరాల వయస్సులోపు ఉన్న బాలికలను సుహాసినులుగా అలంకరించి వారికి మహిళలు, పురుషులు పెద్ద ఎత్తున పాదాబి వందనాలు చేశారు. అనంతర గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 7.55 గంటలకు శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్ర స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ట అనంతరం కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

## రెండో రోజూ ఆక్రమణల తొలగింపు



రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

**మచిలీపట్నంటౌన్:** నగరంలో రోడ్డు మార్జిన్లలో ఏర్పాటు చేసిన దుకాణాల తొలగింపును నగరపాలక సంస్థ అధికారులు రెండో రోజైన శనివారం కూడా నిర్వహించారు. లక్ష్మీ టాకీస్ సెంటర్ నుంచి విజయవాడ బైపాస్ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన బడ్డీలను, దుకాణాలను తొలగించారు. డ్రెయిన్స్‌పై ఉన్న ఆక్రమణలను, సిమెంట్ బిళ్లలను జేసీబీ, క్రేన్‌ల సాయంతో తొలగించారు. నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, టీపీఓ హరిప్రసాద్‌ల పర్యవేక్షణలో పోలీసు పహర నడుమ ఈ పనులు చేపట్టారు. డీమార్టు, వరం మాల్ ప్రాంతంలో ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్య అధికమైన నేపథ్యంలో ఆ ప్రాంతంలోని ఆక్రమలను తొలగించామని కమిషనర్ బాపిరాజు తెలిపారు. వరం మాల్ నిర్వాహకులు రోడ్డు మార్జిన్ ఆక్రమణలను తొలగించామన్నారు. ఇకపై రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రానున్న రెండు వారాల్లో నగరంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలను తొలగిస్తామన్నారు.

## రసాయన మందులను అధికంగా పిచికారీ చేయొద్దు



రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ సుధారాణి

**దేవరకోట(ఘంటసాల):** రసాయన మందులను అధిక మోతాదులో పిచికారీ చేయడం వల్ల మినుములో పేనుబంక, ఎర్రనల్లి ఉధృతి పెరుగుతుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. మండలంలోని దేవరకోట గ్రామంలో మినుము రకాలైన టీబీజీ 141, జీబీజీ 190 పంటలను ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా టీబీజీ 141, జీబీజీ 190 మినుము రకాలు పురుగు తట్టుకునే లక్షణాలు, ఎదుగుదల, మొదలగు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ కృష్ణా జిల్లాలోని అన్ని ప్రాంతాలలో మినుము పంటకు సూచించిన రసాయన మందులను రైతులు నిర్ధేశించిన మోతాదులోనే చేసుకోవాలని, ఎక్కువ, తక్కువ పిచికారి చేయకూడదన్నారు. మినుములో పేను బంక వలన బొబ్బరాకు లేదా సీతాఫలం తెగులు వ్యాప్తి చెందుతుందన్నారు. దీని నివారణకు ఎకరాకు ఇమిడాక్లోప్రిడ్ మందును 60 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు డాక్టర్ సుధారాణి సూచించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ రేవతి, డాక్టర్ వెంకటలక్ష్మి, రైతు వేమూరి రత్నగిరి పాల్గొన్నారు.

**కేవీకేలో ఉయ్యాలవాడ వర్ధంతి**

**ఘంటసాల:** స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని స్థానిక కేవీకేలో శనివారం నిర్వహించారు. శాస్త్రవేత్తలు నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

**మట్టి నాణ్యతాప్రమాణాలపై శిక్షణ**

చేపలు, రొయ్యల చెరువుల్లో నీరు, మట్టి నాణ్యత ప్రమాణాలపై శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. మట్టిలో పోషకాలు,నాణ్యతా ప్రమాణాలు, పోషకాహార లోపం వలన కలిగే దుష్పరిమాణాలు, వ్యాధుల గురించి తెలిపారు.

**విషపు ఎర తయారీ ప్రదర్శన..**

మినుము పంటలో పొగాకు లద్దె పురుగు ఆశించి అధిక నష్టాన్ని కలుగజేస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. చిన్న దశ పురుగులను రసాయన మందులు పిచికారీ సరిపోతుందన్నారు. పెద్ద దశ పురుగు యాజమాన్యంలో విషపు ఎర తప్పనిసరి అని తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా తెలిపారు. సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నవీన్ వి.మంజువాణి, యశ్వంత్ కుమార్, జి.కృష్ణవేణి, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హడలెత్తిస్తున్న వానరాలు



**కోడూరు:** వానరాల గుంపులు గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలను హడలెతిస్తున్నాయి. కోడూరు, చుట్టూ పక్కల గ్రామాల్లో వానరాలు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయందోళనకు గురి చేస్తున్నాయి. మాచవరం, లింగారెడ్డిపాలెం, విశ్వనాథపల్లి, కోడూరు, జయపురం గ్రామాల్లో వానరాలు ఇళ్లలోకి కూడా చొరబడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇంటి తలుపులు తీసి ఉంటే వానరాలు లోపలకు వచ్చి వస్తువులతో పాటు విలువైన సామగ్రిని బయటకు తీసుకువెళ్లి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వానరాలు మనుషులపై భౌతికంగా కూడా దాడులకు పాల్పడుతున్నాయని పైగ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. చిన్నపిల్లలపై కోతుల దాడులు అధికంగా ఉన్నాయని, ఇళ్లలో నుంచి పిల్లలు బయటకు రావాలంటే భయందోళన చెందుతన్నారని వాపోతున్నారు. ప్రధాన రహదారులపై కూడా వానరాల సంచారం అధికంగా ఉండడంతో వాహనచోదకులు కూడా ఆందోళన చెందుతున్నారు. వాహనచోదకులపై కూడా ఇవి దాడులకు పాల్పడుతున్నాయి. పంచాయతీల అధికారులు వానరాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### సారా విక్రేత అరెస్ట్

**గూడూరు:** మండలంలోని సూరదాయిపేటలో సారా విక్రయిస్తున్న మహిళను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు వనివారం పట్టుకున్నారు. గ్రామంలో సారా విక్రయిస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించిన దాడులలో గూడవల్లి చుక్కమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెపెక్టర్ తెలిపారు. దాడుల్లో ఎం.వసంత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.